సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 8 । ఏప్రిల్ । 2023

గరిష్టం / కనిష్టం
38° / 23°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రివేళ ఉక్కపోతగా ఉండవచ్చు.

ఇఫ్తార్ (శనివారం సా.) 6.28
సహర్ (ఆదివారం ఉ.) 4.36
రంజాన్ వేళలు



పాల్వంచలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



యేసు సిలువ మార్గం..

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

క్రైస్తవులు శుక్రవారం జిల్లావ్యాప్తంగా గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు సిలువపై ప్రాణాలను అర్పించిన తీరును మతపెద్దలు వివరించారు. కొత్తగూడెం సెయింట్ అంద్రూస్, బేతానియా, బెతస్త చర్చిలు, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట, మణుగూరు తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో సందడి నెలకొంది.

వివరాలు 11లో

డిపో రెడీ.. ప్రారంభమెప్పుడో..?

ఇల్లెందులో నిర్మాణం పూర్తయిన ఆర్టీసీ బస్ డిపో

- గత ఫిబ్రవరిలోనే ప్రారంభోత్సవ హడావుడి
- ఆ తర్వాత రెండు నెలలుగా ఉలుకూపలుకు లేని వైనం
- మొదలైన వేసవి సీజన్, పెరిగిన ప్రయాణాలు
- ఏజెన్సీవాసులకు తప్పని ప్రయాణ తిప్పలు



ఇల్లెందులో నిర్మించిన ఆర్టీసీ బస్ డిపో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దశాబ్దాల తరబడి విజ్ఞప్తులు, విన్నపాలకే పరిమితమైన బస్‌డిపో కల సాకారం చేసుకునేందుకు ఇల్లెందు ఏజెన్సీ ప్రజలకు ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. గడిచిన మూడు దశాబ్దాలుగా ఇల్లెందులో బస్ డిపో ఏర్పాటు చేయాలంటూ డిమాండ్లు రావడం, ఆఖరికి ఆ బస్‌డిపోలు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం పరిపాటిగా మారుతూ వచ్చింది. ఇక ఇల్లెందులో బస్ డిపో అనేది ఇక ఎప్పటికీ నెరవేరని కలగానే మిగిలిపోతుందనే భావన నెలకొన్న సమయంలో పరిస్థితుల్లో మార్పు వచ్చింది. రవాణా మంత్రిత్వ శాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన పువ్వాడ అజయ్‌కుమార్‌కు దక్కింది. అదే సమయంలో ఇల్లెందు ఎమ్మెల్యేగా హరిప్రియా నాయక్ బస్‌డిపో మంజూరు కోసం పట్టువదలకుండా ప్రయత్నం సాగించారు. దీంతో కొత్తగా శాటిలైట్ డిపో ఇల్లెందుకు మంజూరైంది. గతంలో ఎక్కడా లేని విధంగా ఆర్థికంగా ఆర్టీసీ కష్టాల్లో ఉండటంతో డిపో నిర్మాణానికి సుమారు రూ.3.90కోట్లను జిల్లా మినరల్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. చివరకు 2021 ఫిబ్రవరిలో డిపో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే ఏడాది అక్టోబరులో జరిగే దసరా నాటికి డిపో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రెండేళ్లపాటు నిర్మాణం

నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులు నత్తనడకన చేపట్టాడు. దీంతో 2021 దసరా నాటికి పూర్తి కావాల్సిన పనులు 2022 దసరా వచ్చినా కొలిక్కిరాలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్మాణ పనులపై దృష్టి పెట్టారు. గడువు పొడిగించి ఆ లోగా పనులు చేపట్టలేకపోతే కాంట్రాక్టరును బ్లాక్‌లిస్టులో పెడతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో గతేడాది చివర్లో పనుల్లో వేగం పెరిగింది. 2023 సంక్రాంతికి డిపోను ప్రారంభించడమే లక్ష్యంగా పనులు శరవేగంగా జరిపించారు. డిపోకు అనుబంధంగా ఉండే ఫ్యూయల్ స్టేషన్ (పెట్రోల్ బంక్) మినహా మిగిలిన పనులన్నీ పూర్తి చేశారు. వివిధ డిపోల నుంచి 27 వరకు కొత్త బస్సులు ఇల్లెందుకు కేటాయించేందుకు ఆర్టీసీ సంస్థ కూడా కసరత్తు పూర్తి చేసింది.

ఇంకా నిర్లక్ష్యమేనా..?

ఇల్లెందు డిపోకు సంబంధించి అన్ని పనులు పూర్తయినా ఫ్యూయల్ స్టేషన్ విషయంలో స్పష్టత రాలేదు. దీంతో బయట బంకుల నుంచి బస్సులకు డీజిల్ కొనుగోలు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. అయితే డిపో ప్రారంభోత్సవం వాయిదా పడటంతో రెండు నెలల సమయం కలిసి వచ్చింది. కానీ ఫ్యూయల్ స్టేషన్‌కు స్థల ఎంపిక, అనుమతులు సాధించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. దీంతో నేటికీ ఫ్యూయల్ స్టేషన్ నిర్మాణం జరగలేదు.

సీజన్ మొదలైనా..

వేసవి సీజన్ సమీపించడంతో వరుసగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు వస్తున్నాయి. దూర ప్రయాణాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో కొత్త డిపో అందుబాటులోకి వస్తే ఇల్లెందు నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్, వరంగల్, జమ్మికుంట, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, వేములవాడ వంటి దూర ప్రాంతాలకు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చే వీలుండేది. దీంతోపాటు ఇల్లెందు నుంచి రాత్రి వేళలో గుండాల, గంగారం, బోడులకు బస్సులు అందుబాటులోకి వచ్చేవి. మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మంలో వివిధ రైళ్ల సమయాలకు అనుగుణంగా రోడ్డు మార్గంలో రవాణా సౌకర్యం ఉండేది. కానీ అంతా సిద్ధంగా ఉన్నా డిపో ప్రారంభోత్సవంపై తాత్సారం చేస్తుండటంతో ఈ వేసవి సీజన్‌లోనూ ఇల్లెందు ప్రజలకు ప్రయాణ తిప్పలు తప్పేలా లేవు.

కేటీఆర్ చేతుల మీదుగా..

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు 2023 ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ ఉమ్మడి జిల్లాలో పర్యటనకు వస్తున్నట్టు ప్రచారం జరిగింది. దీంతో కేటీఆర్ చేతుల మీదుగా 2023 ఫిబ్రవరి 10న డిపో ప్రారంభోత్సవం కోసం హడావుడి చేశారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులు చకచకా పూర్తి చేశారు. ఇక ప్రారంభోత్సవ ఫలకం రెడీ చేయించడమే తరువాయి అన్న తరుణంలో కేటీఆర్ జిల్లా పర్యటన రద్దయింది. దీంతో డిపో ప్రారంభోత్సవం కూడా వాయిదా పడింది. దాదాపు రెండు నెలలు గడిచినా నేటికీ ప్రారంభోత్సవంపై ఎటువంటి కదలిక లేదు. మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే హరిప్రియ, ఆర్టీసీ అధికారులు సైతం ఈ అంశంపై మిన్నకుండిపోయారు.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



బేడా మండపంలో కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవ జరిపారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు పురాణం రవికుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

నీటి సరఫరా కొనసాగించండి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జునసాగర్ రెండో జోన్ పరిధిలోని ఆయకట్టుకు ఈ నెల 30వ తేదీ వరకు సాగునీటి సరఫరా కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

'పరీక్ష'కు దారిస్తారా?



పదో తరగతి విద్యార్థులు పరీక్షకు వెళ్లాల్సిన ఈ మార్గం(బస్టాండ్ సెంటర్)లోనే బీఆర్ఎస్ మహాధర్నాకు ఏర్పాట్లు..

- నేడు బస్టాండ్ కూడలిలో బీఆర్ఎస్ మహాధర్నా
- బస్ స్టేషన్ చుట్టూ పదో తరగతి పరీక్ష కేంద్రాలు
- విద్యార్థులు వెళ్లేందుకు ప్రత్యామ్నాయం చూపని ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అధికార భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నేడు మహాధర్నా చేపడుతున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు బస్ స్టేషన్ కూడలిని వేదికగా నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు పోలీసుల నుంచి అనుమతులు కూడా తీసుకున్నారు. అయితే శుక్రవారం రాత్రి 9 గంటల నుంచే పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్‌స్టేషన్ వైపు ఉన్న మార్గాన్ని బ్లాక్ చేసి వేదిక నిర్మాణ ఏర్పాట్లు చేపట్టారు.

చుట్టూ పదో తరగతి పరీక్ష కేంద్రాలు

కొత్తగూడెం బస్ స్టేషన్ కూడలి, పోస్టాఫీస్ కూడలికి నలువైపులా జీహెచ్ఎస్ బాబూక్యాంపు, జీహెచ్ఎస్ చుంచుపల్లి, లిటిల్‌బడ్స్, సింగరేణి పాఠశాల, సెయింట్ మేరీస్ పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. వీటికి పైన రుద్రంపూర్, ఆనందఖని, రామవరం ప్రాంతాల్లో కూడా కేంద్రాలు ఉన్నాయి. 1,600 మందికిపై విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్ష కేంద్రానికి ఐదు నిమిషాల కంటే ఆలస్యంగా వెళితే కేంద్రంలోకి అనుమతించ కూడదనే నిబంధన అమల్లో ఉంది. బస్ స్టేషన్ కూడలికి దిగువ భాగాన రైల్వే ట్రాక్, అండర్ బ్రిడ్జి ఉన్నాయి. ఎంజీ రోడ్డు వైపు ఉన్న విద్యార్థులు పోస్టాఫీస్ వైపు ఉన్న సెంటర్లకు వెళ్లాలన్నా, పోస్టాఫీస్ వైపు ఉన్న విద్యార్థులు ఎంజీ రోడ్డు వైపు ప్రయాణం చేయాలన్నా బస్ స్టేషన్ సెంటర్‌ని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే సింగరేణి హెడ్ ఆఫీస్, సింగరేణి ప్రధాన ఆస్పత్రి, బూడిదగడ్డ మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో చాలా సమయం వృథా అయ్యేందుకు ఆస్కారం ఉంది.

ప్రచారమేది?

శనివారం ఉదయం సభకు శుక్రవారం రాత్రి నుంచే రోడ్డును బ్లాక్ చేసి వేదిక పనులు చేపడుతున్నారు. దీంతో నేటి ఉదయం నుంచే ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఉండనుంది. దీనికి తగ్గట్టుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, దానికి సంబంధించిన సమాచారం ప్రజలకు చేరవేయడంలో కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. ఏ ధర్నాలు , ర్యాలీలు చేసినా పోలీసుల పర్మిషన్ తప్పనిసరి. అనుమతులు ఇచ్చే పోలీసులు అందుకు తగ్గట్టుగా ప్రత్యామ్నాయం కూడా చూపెట్టాల్సి ఉంటుంది. కానీ కొత్తగూడెంలో ధర్నాలు, ర్యాలీల సందర్భంగా ముందస్తు సమాచారం లేక రోడ్ల మీదకు వచ్చిన జనం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మండుటెండలో చెమటలు కక్కుతూనే ఉన్నారు.

● కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) షెడ్యూల్ విడుదల చేశారు. ఈ పరీక్షలు 17వ తేదీ నుంచి మొదలవుతాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

తునికాకు కట్ట రూ.3.01

కొత్తగూడెం డివిజన్‌లోని 12 యూనిట్లలో ధర అమలు



చర్చల్లో పాల్గొన్న నాయకులు, కాంట్రాక్టర్లు

ఇల్లెందు/గుండాల: గిరిజనులు వేసవి రెండో పంటగా భావించే తునికాకు సేకరణకు ప్రభుత్వం ధర పెంచింది. కార్మికులకు ఈ సీజన్‌లో 50 ఆకుల కట్టకు రూ.3.01చొప్పున చెల్లించనున్నారు. ఆళ్లపల్లి మండలంలోని అనంతోగులో శుక్రవారం తునికాకు రేటుపై ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల మధ్య చర్చలు జరిగాయి. గతేడాది ప్రభుత్వం ధర రూ. 2.05పైసలు ఉండగా కాంట్రాక్టర్లు 2 పైసలు పెంచి, కార్మికులకు రూ. 2.07 చొప్పున చెల్లించారు. ఈ ఏడాది ప్రభుత్వం 95 పైసలు పెంచగా, కాంట్రాక్టర్లు మరో పైసా అదనంగా పెంచారు. దీంతో కట్టకు రూ. 3.01 చొప్పున కార్మికులకు చెల్లించనున్నారు. కల్లేదార్ల కమీషన్, హ్యాండ్లింగ్ చార్జీలు గతంలో వెయ్యి కట్టకు రూ. 275 ఉండగా, 10శాతం పెంచి రూ.302.50గా నిర్ణయించారు. ఇందులో కల్లేదార్ల కమీషన్, రూ.142.78, పల్లా, కుచ్చాలకు రూ. 72.60, భర్తీకి రూ.87.12 కేటాయించారు.

బీమా వర్తింపజేయాలి

తునికాకు సేకరణ సమయంలో ప్రమాదానికి గురైతే సంబంధిత కాంట్రాక్టర్లు ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం పట్టణానికి తరలించేందుకు వాహన సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ బీమా వర్తింప చేయాలని కాంట్రాక్టర్లను నాయకులు, కార్మికులు కోరారు. కాగా ఈ నిబంధనలు కొత్తగూడెం డివిజన్ పరిధిలోని 12 యూనిట్ల పరిధిలోఉన్న కల్లాల్లో అమలవుతాయని చర్చల ప్రతినిధులు తెలిపారు. ఈ చర్చల్లో కాంట్రాక్టర్లు సర్వోత్తమరెడ్డి, నరేందర్ రెడ్డి, మంతజిములు సయ్యద్ అజ్జు, సరోతం, హఫీజ్, ఖుద్దూస్, నాయకులు ముక్తి సత్యం, మురళీకృష్ణ, ఆవునూరి మధు, మందారి ఐలయ్య, వెంకటయ్య, ప్రతాప్‌రెడ్డి, రాయల చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, శంకర్, సాబీర్‌పాష, రేసు ఎల్లయ్య, సైదులు, రమణాల లక్ష్మయ్య, గుంపిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య గౌతంపూర్



గౌతంపూర్ గ్రామ పంచాయతీ వ్యూ


- జాతీయస్థాయిలో ప్రథమస్థానం సాధించిన పంచాయతీ
- పాలకవర్గం, అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అనుదీప్ ప్రశంసలు

చుంచుపల్లి: జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిచిన గౌతంపూర్ ఇప్పుడు జాతీయ స్థాయిలో మెరిసింది. శుక్రవారం గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రకటించగా, 'ఆరోగ్య పంచాయతీ (హెల్దీ పంచాయతీ) విభాగంలో గౌతంపూర్ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి ఉత్తమ గ్రామపంచాయతీలకు ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనునున్నారు. గౌతంపూర్‌కు అవార్డుతోపాటు రూ.50 లక్షల నగదు పురస్కారాన్ని సైతం అందించనున్నారు.

గతేడాది అక్టోబర్‌లో దరఖాస్తు..

జాతీయస్థాయి అవార్డుల్లో భాగంగా గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పురస్కారాలకు తొమ్మిది విభాగాల్లో పనితీరును పరిశీలించారు. గౌతంపూర్ గ్రామపంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామంలో అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిచింది. ఆ తర్వాత జాతీయస్థాయి అవార్డుకు నామినేట్ చేయగా దేశంలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా మొదటి స్థానం దక్కించుకుంది. ఉత్తమ పంచాయతీగా జాతీయస్థాయిలో నిలిపిన గౌతంపూర్ సర్పంచ్ పొడియం సుజాత, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి జక్కం షర్మిల, మండల అధికారుల బృందం జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్ రాజులను కలెక్టర్ అనుదీప్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా నుంచి జాతీయస్థాయిలో గౌతంపూర్ అవార్డును దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది అందరి కృషి వల్లనే సాధ్యమైందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో పల్లెలను మరింత ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేయాలని సూచించారు.

ఇతర పంచాయతీలకు ఆదర్శం



జాతీయస్థాయిలో గౌతంపూర్ గ్రామపంచాయతీ అవార్డు దక్కించుకోవడం ఆనందంగా ఉంది. పంచాయతీ పాలకవర్గం అభివృద్ధిపై మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించటం వల్లనే ఇది సాధ్యమైంది. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉంటే అవార్డులు వాటంతట అవే వరిస్తాయి.

–గుండి సత్యనారాయణ, ఎంపీఓ

సమష్టి కృషితోనే అవార్డు..



గౌతంపూర్‌కు జాతీయస్థాయిలో అవార్డు రావడం వెనక పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, మండల అధికారుల సమష్టి కృషి ఉన్నది. గ్రామ పంచాయతీ అభివృద్ధి పరచాలనే పట్టుదలతో పాలకవర్గం ముందుకెళ్లడం ప్రశంసనీయం. అవార్డుల పరంపరలో పంచాయతీ దూసుకెళ్తోంది.

–రమాకాంత్, డీపీఓ



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ఇవీ ప్రత్యేకతలు..

- గౌతంపూర్.. ఉమ్మడి రుద్రంపూర్ పంచాయతీ నుంచి 4,407 జనాభాతో 2019లో కొత్త పంచాయతీగా ఏర్పడగా, ప్రస్తుతం తొలిపాలక మండలి పాలన సాగిస్తోంది. పంచాయతీలో 12 వార్డులు ఉండగా, మహిళా సర్పంచ్ పాలన సాగిస్తున్నారు.
- పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, హరిత నర్సరీ ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎస్సార్ నిధులు కూడా అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పడుతున్నాయి.
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పాలకవర్గం, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పచ్చదనం, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ లు, రహదారుల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు.
- కరోనా మహమ్మారి నియంత్రణకు విశేషంగా కృషి సల్పి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. కరోనా నివారణ వ్యాక్సినేషన్ 100 శాతం పూర్తి చేశారు. విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వారంలో రెండు రోజులు డ్రైడే –ఫ్రైడే కార్యక్రమం పాటిస్తున్నారు.



వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సింగరేణి పరిరక్షణకు ఉద్యమం

- నేడు కొత్తగూడెంలో మహాధర్నా
- బీఆర్ఎస్ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు కాంతారావు, మధు



మాట్లాడుతున్న విప్ కాంతారావు, పక్కన ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు వనమా, సండ్ర తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రాన్ని అస్థిరపర్చే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించే యత్నం చేస్తోందని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. కోట్లాది మంది ప్రాణాధారమైన సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు రాజకీయాలు, యూనియన్లకు అతీతంగా ఉద్యమించాలని కోరారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపులో భాగంగా కొత్తగూడెంలో శనివారం మహాధర్నా నిర్వహించనున్న నేపథ్యాన కొత్తగూడెం, సత్తుపల్లి ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావ్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పి.. ఢిల్లీ వెళ్లగానే కోయగూడెం, శ్రావణపల్లి, సత్తుపల్లి ఓసీ తదితర గనులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేలా టెండర్లు ఆహ్వానించారని మండిపడ్డారు. సింగరేణిని ప్రైవేటీకరించడమంటే తెలంగాణ గొంతు కోయడమేనని వ్యాఖ్యానించిన వారు.. బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో దేశాన్ని భ్రష్టుపట్టిస్తూ జాతి విద్రోహానికి పాల్పడుతోందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను అడ్డుకోవడంతో పాటు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈమేరకు కేంద్రం తీరును నిరసిస్తూ కొత్తగూడెంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యాన చేపడుతున్న మహాధర్నాలో అన్ని వర్గాల ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కాంతారావు, మధు కోరారు. కాగా, ప్రశ్నపత్రాల లీకేజీతో విద్యార్థుల జీవితాలను ఇరకాటంలోకి నెట్టిన బీజేపీ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావుతో పాటు నాయకులు మోరె భాస్కర్, జేవీఎస్.చౌదరి, బాదావత్ శాంతి, ఎం.డీ.రజాక్, ఎం.సోమిరెడ్డి, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తొలుత కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

15న 'పెద్దమ్మగుడి' దుకాణాలకు వేలం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం సముదాయంలోని కొబ్బరికాయల దుకాణాలు, తలనీలాలు పోగు చేసుకోవడం.. చీరలు వేలం వేసేందుకు మే 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు లైసెన్స్ హక్కులు పొందేందుకు బహిరంగ వేలంపాట ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ నంబర్ షాపు కొబ్బరికాయలు, పూజ సామగ్రి రూ.2 లక్షలు, షాపు నంబర్–2 కొబ్బరికాయలు, పూజ సామగ్రి రూ.లక్ష.. 3, 4 దుకాణాలకు రూ.50 వేలు, తలనీలాలు పోగు చేసేందుకు లైసెన్స్ హక్కు రూ.2 లక్షలు, చీరలు పోగు చేసుకునేందుకు రూ.2 లక్షలు, ఆలయ ప్రాంగణంలో పూలదండలు విక్రయించుకునేందుకు రూ.20 వేలు, ఫొటోలు తీసుకునేందుకు రూ.20 వేలు, టెంట్ సామగ్రి సరఫరా చేసేందుకు రూ.20 వేలు, స్క్రాప్ విక్రయం రూ.2 వేలకు.. పూచీకత్తుతోపాటు డీడీలు జతపరిచి టెండర్ వేసి బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రూ.500 చెల్లించి దేవస్థానం కార్యాలయంలో షెడ్యూల్ పొందాలని సూచించారు.

పల్లె చెరువుల్లోనూ పెద్ద చేపలు



పది కిలోలకు పైగా బరువైన చేపతో సొసైటీ సభ్యులు

ఇల్లెందురూరల్: మూడేళ్లుగా వరణుడి ప్రతాపంతో చెరువులన్నీ కాలంతో పనిలేకుండా జలకళ ను సంతరించుకున్నాయి. ఇది మత్స్య సంపద వృద్ధికి తోడ్పడింది. మండలంలోని చల్లసముద్రం పెద్దచెరువు గతంలో దశాబ్దానికి ఒక మారు అలుగుపోయడం ఉండేది. కానీ మూడేళ్లుగా వరుసగా అలుగుపోయడంతో పంటలు సమృద్ధిగా పండాయి. రెండో పంటకు కూడా చాలా మంది రైతులు ప్రాధాన్యమిస్తూ ఆరుతడి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నే మత్స్యశాఖ సొసైటీ ఆధీనంలో ఉన్న ఈ చెరువులో సొసైటీ సభ్యులు కొన్ని చేపలను కొనుగోలు చేసి చెరువులో వదులుతుంటారు. ఇలా మూడేళ్లుగా చెరువులో పెరిగిన చేపలు ప్రస్తుతం గతంలో ఎన్నడూ చూడని విధంగా పదికిలోలకు పైగా బరువుతో ప్రత్యక్షమవుతున్నాయి. చెరువులో పట్టుకున్న చేపలను చూసి సొసైటీ సభ్యులతోపాటు చేపల ప్రియులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక బరువుతో లభిస్తున్న చేపలను సొసైటీ సభ్యులు సైతం శుక్రవారం చల్లసముద్రం పెద్ద చెరువు వద్దే తక్కువ ధరకు విక్రయిస్తుండటం గమనార్హం.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. గురువారం జరిగిన ఘటన వివరాలను పోలీసులు శుక్రవారం వెల్లడించారు. భద్రాచలం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన వినయ్‌కుమార్, విష్ణువర్దన్, రమాదేవి 14 కిలోల గంజాయిని ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో కొనుగోలు చేసి భద్రాచలం ఇసుక ర్యాంపు వద్ద దాచారు. అనంతరం గంజాయిని ఆటో రిక్షా, మోటార్ సైకిల్‌పై బూర్గంపాడుకు అక్రమంగా తరలిస్తుండగా ముగ్గురుని పట్టుకున్నట్లు ఏఎస్పీ పారితోష్ పంకజ్ తెలిపారు. వారితో పాటు మరో నలుగురు కూడా ఈ గంజాయి తరలింపులో భాగస్వాములుగా ఉన్నారని, పట్టుబడిన గంజాయి విలువ రూ. 2,80,000 ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూరాకుల వెంకటేశ్వర్లు (54) శుక్రవారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య కథనం ప్రకారం.. మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన కూరాకుల వెంకటేశ్వర్లు ఈ నెల 3వ తేదీన సాయంత్రం మిర్చి తోటను చూసి రావడానికి తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అనంతారం నుంచి కాకర్ల వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం అదే రోజు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు కూరాకుల రవికుమార్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మాచినేనిపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బానోత్ వీరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య పేర్కొన్నాడు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

'ట్రెజర్ హంట్' కేసులో ఐదుగురిపై కేసు

తెరపైకి రైస్ పుల్లింగ్ వివాదం



సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడెంరూరల్: 'ట్రెజర్ హంట్' కేసులో కొత్త కోణం బయట పడింది. రైస్ పుల్లింగ్ పాత్ర చుట్టూ కథ నడవగా బంధువులే డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేసుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో గుప్తనిధులు లభ్యమయ్యాయనే ప్రచారం జరగగా, భద్రపరిచే విషయంలో బంధువుల నడుమ తగాదాలు జరిగిన అంశంపై 'సాక్షి'లో గురువారం 'ట్రెజర్ హంట్!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించి పోలీసులు కూపీ లాగగా అసలు కథ బయటపడింది. లక్ష్మీదేవిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ ఉపసర్పంచ్ వినోద్ గత నెల 18న అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన తన బావమరిది, ట్యాక్సీ డ్రైవర్ శేషగిరికి ఫోన్ చేశాడు. పునుకుడు చెలక ప్రాంతంలో ఒక గది అద్దెకు తీసుకోవాలని చెప్పి అక్కడ విలువైన వస్తువు దాయాల్సి ఉందని తెలిపాడు. అయితే, అంత దూరంలో గది దొరకడం కష్టమని చెప్పిన శేషగిరి అనిశెట్టిపల్లిలో తన ఇంట్లోనే ఓ గది ఇస్తానని వెల్లడించాడు. అదే రోజు సాయంత్రం తన స్నేహితులు పాషా, నవీన్, వెంకట్, రవితో శేషగిరి ఇంటికి వినోద్ వచ్చాడు. అక్కడ ఎంతో విలువైన వస్తువు అంటూ రైస్ పుల్లింగ్ పాత్రను చూపించి ఓ గదిలో దాచిపెట్టారు.

పాత్ర పోయిందంటూ బెదిరింపులు

మరుసటి రోజైన మార్చి 19న ట్యాక్సీ డ్రైవర్ శేషగిరి కిరాయి వస్తే మారేడుమిల్లికి వెళ్లాడు. అక్కడ ఉండగానే వినోద్ ఫోన్ చేసి 'నీ ఇంట్లో దాచిన రూ.కోటి విలువైన వస్తువు(రైస్ పుల్లింగ్ పాత్ర) పోయింది' అని చెప్పారు. అనంతరం అనిశెట్టిపల్లికి వచ్చిన శేషగిరిని వినోద్, ఆయన స్నేహితులు కలిసి ఎదురుగడ్డకు తీసుకెళ్లారు. ఇంట్లో దాచిన రూ.కోటి విలువైన వస్తువు పోయినందున డబ్బు కట్టాల్సిందేనని శేషగిరిని బంధించి కొట్టారు. ఈవిషయం తెలుసుకున్న శేషగిరి తండ్రి అక్కడకు వెళ్లగా ఆయనను కూడా బంధించి దాడి చేశారు. దీంతో ఆందోళనకు గురైన శేషగిరి, ఆయన తండ్రి పరిహారంగా రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి వారి చెర నుంచి బయట పడ్డారు. నానా తంటాలు పడి ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి రూ.4.70 లక్షలను వినోద్‌కు ఇచ్చినా మిగిలిన డబ్బు విషయంలో శేషగిరిని వినోద్, ఆయన స్నేహితులు ఒత్తిడి చేస్తుండడంతో లక్ష్మీదేవిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు వినోద్‌తో పాటు పాషా, నవీన్, వెంకట్, రవిపై చీటింగ్ కేసు నమోదు చేశామని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

9న 'పొంగులేటి' ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

చుంచుపల్లి: కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 9న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన నియోజవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. కొత్తగూడెంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజల మనిషి అని.. వైఎస్సార్‌సీపీ నుంచి తనతో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలను గెలిపించుకుని ఆనాడే సత్తా చాటారని గుర్తుచేశారు. అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరినా అధిష్టానం ఆదేశాల మేరకు సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని త్యాగం చేసిన ఘనత పొంగులేటికి దక్కుతుందని తెలిపారు. అలాంటి నేత విషయంలో అధిష్టానం వ్యవహరిస్తున్న తీరుతో బయటకు రావాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు విశేష స్పందన లభిస్తోందని, ఇందులో భాగంగానే 9వ తేదీన కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సమ్మేళనం ఏర్పాటు చేశామని కనకయ్య తెలిపారు. సమావేశానికి అభిమానులు, అన్నివర్గాల ప్రజలుహాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఊకంటి గోపాల్‌రావు, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, తూము చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌కు ఇంకా రాని సీఐ?

- రాజకీయ ఒత్తిళ్లు, బందోబస్తు డ్యూటీ తప్ప మరేమి ఉండదని భావన..?
- పోస్టింగ్ ఆలస్యానికి పైరవీలే కారణమని ప్రచారం



కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ బదలీ అయి నెలరోజులు కావస్తున్నా.. ఇప్పటివరకు మరో సీఐ జాయిన్ అవ్వలే.. ఇక్కడ సీఐగా పనిచేసిన సీఐ బత్తుల సత్యనారాయణ బదిలీ అయిన తరువాత ఖమ్మం త్రీటౌన్ సీఐ జాయిన్ అయ్యారు. కానీ, అతను వెళ్లినప్పటి నుంచి ఇక్కడకు రావడానికి సీఐలు ఎందుకు ఆసక్తి చూపించడం లేదనే విషయం ఇప్పుడు కొత్తగూడెంలో హాట్ టాపిక్‌గా మారింది. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐగా టూటౌన్ సీఐ ఎల్.రాజు వ్యవహరిస్తున్నారు. సీఐ బదిలీ అయిన తరువాత ఒక హత్య కేసు కూడా నమోదైంది. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ నాయకుల ఒత్తిడి, ఇక్కడ బందోబస్తు నిత్యం అవసరం ఉంటుంది. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం రైటర్‌బస్తీలో ఉండటం నిత్యం ఎవరో ఒక వీఐపీ రావడం, అలాగే, ఇదే ప్రాంతంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, కార్మిక సంఘాల కార్యాలయాలు, రైటర్‌బస్తీ సమీపంలో ఇండస్ట్రియల్ ఏరియా, సింగరేణి సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు కార్మిక సంఘాల కార్యాలయాలున్నాయి. నిత్యం కార్మికుల సమస్యలపై ఏదో ఒక సమస్యపై అటు పలు పార్టీలు, కార్మిక సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు పోరాటాలు చేస్తుండటంతో నిత్యం పోలీసులకు పహారా అవసరం ఉంటుంది. శాంతిభద్రతల పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలకు సంబంధించిన వారి ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటాయనే భయంతో పోస్టింగ్‌కు రావాలంటేనే ఆసక్తిని చూపించడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొత్తగూడెం వన్‌టౌన్‌తో పోలిస్తే టూటౌన్, త్రీటౌన్‌లలో రాజకీయ, పారిశ్రామిక ఒత్తిళ్లు తక్కువగాను అవి వ్యాపార సముదాయాలు, సింగరేణి కార్మిక ప్రాంతం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరిగే ప్రాంతం కావడంతో అక్కడ అన్ని విధాలా బాగుంటుందని పోస్టింగ్‌ను కోరి మరి పైరవీలతో వచ్చి చేరుతుంటారని సమాచారం. త్రీటౌన్‌లో జిల్లాలోనే అతి పెద్ద మార్కెట్‌గా ఎంజీ రోడ్డు సూపర్‌బజార్, పెద్దబజార్, చిన్నబజార్, మల్టీ లెవెల్ ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు ఉంటాయి. రోజుకు ఇక్కడ కోట్ల రూపాయల లావాదేవీలు నడుస్తుంటాయి. త్రీటౌన్‌కు పోస్టింగ్‌కు రావాలంటే తీవ్ర పోటీ నెలకొంటోందని తెలుస్తోంది. ఇలా ఏ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితే అన్ని విధాలా లాభాలు వస్తాయో బేరుజు వేసుకుని పోస్టింగ్‌లను తీసుకునేందుకు ఆసక్తిని చూపిస్తుంటారని.. అందుకే కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ కంటే మిగతా టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లకు ఎక్కువ మొగ్గు చూపుతారని ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడకు సీఐలు చేరడం ఇష్టం లేకనే ఇంత ఆలస్యం అవుతోందని ప్రజల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

దేవాలయాలకు పొంగులేటి విరాళం



ఆలయాల నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఇల్లెందు నియోజకవర్గంలోని పలు దేవాలయాల నిర్మాణానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విరాళాలు అందజేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సమక్షాన ఆలయకమిటీ బాధ్యులకు విరాళం అందజేసి మాట్లాడారు. టేకులపల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, తొమ్మిదో మైలు తండాలోని ఆంజనేయస్వామి, కుంటల్ల ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి, కోయగూడెంలో అయ్యప్ప స్వామి ఆలయం, చుక్కాల బోడు ఆంజనేయ స్వామి ఆలయాలకు రూ.25వేల చొప్పున రూ.1.50లక్షలతో పాటు గార్లలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.25వేలను పొంగులేటి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ దొడ్డా నగేష్, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, విజయబాయి, ధరావత్ రామ్మూర్తి, షేక్ ఆరిఫ్, గుర్రం సత్యనారాయణ, మాలోత్ రాము, ఆరవికట్ల సుదీప్, మూడ్ చిన్నా, పూనెం ఉమ, పూనెం సురేందర్, బానోతు భద్రు, ఈది గణేష్, మోకాళ్ల పోశాలు, తులసీరాం, భూక్యా సర్దార్, బానోతు రవి, రావూరి సతీష్, వీరన్న పాల్గొన్నారు.

భూతగాదా నేపథ్యంలో జీడి మామిడి మొక్కలు ధ్వంసం

దమ్మపేట: భూతగాదాల నేపథ్యంలో జీడి మామిడి మొక్కలను ధ్వంసం చేసిన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముష్టిబండ గ్రామానికి చెందిన కోలికపోగు సుధాకర్‌రావుకు గ్రామ శివారులో 90 మొక్కల జీడి మామిడి తోట ఉంది. అదే భూమిని గ్రామానికి చెందిన కోలికపోగు వెంకటరామారావు తన భూమిగా చెప్పుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన ఆ తోటలోకి వెంకటరామారావు ప్రవేశించి.. 90 జీడి మామిడి మొక్కలను ధ్వంసం చేశాడు. వాటి విలువ సుమారుగా రూ.1.50 లక్షలు ఉంటుందని తోట యజమాని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నలుగురు జూదరులు అరెస్టు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధి పాత కొత్తగూడెంలో మట్కా జూదం ఆడుతూ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పాత కొత్తగూడెంలోని భవానీ టెంట్‌హౌస్ పక్కన మట్కా ఆడుతున్నట్లు సమాచారం అండటంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.9,050 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే, టూటౌన్ ఏరియా మాయాబజార్‌లో మట్కా ఆడుతున్న వక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.8,500 నగతు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రామయ్య సేవలో ఏపీ హైకోర్టు జడ్జి



రామాలయంలో జడ్జి సుజాత

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని ఏపీ హైకోర్టు జడ్జి సుజాత కుటుంబ సమేతంగా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, జడ్జి ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కూడా న్యాయమూర్తి పూజలు చేశాక, ఆలయ అధికారులు ఆమెను సత్కరించి స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

యాష్ ట్యాంకర్ పైనుంచి పడి డ్రైవర్ దుర్మరణం

కేటీపీఎస్ సైలో వద్ద ట్యాంకర్ మూత బిగిస్తుండగా ప్రమాదం



కేటీపీఎస్ సైలో వద్ద ట్యాంకర్ పైనుంచి పడిన డ్రైవర్ రమేశ్ (ఇన్‌సెట్) రమేశ్ మృతదేహం

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో యాష్ ట్యాంకర్ పైనుంచి పడి డ్రైవర్ తీవ్రగాయాల పాలయ్యాడు. హుటాహుటిన అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జెక్కపల్లి గ్రామానికి చెందిన చట్టు రమేశ్(40) ఓ సిమెంట్ కంపెనీలో 14 టైర్ల గూడ్స్ ట్యాంకర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలోని సైలో వద్ద ట్యాంకర్‌లో బూడిద లోడింగ్ కోసం వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కేఎస్పీరోడ్‌లోని గేటు నుంచి లోపలికి వెళ్లి యాష్ లోడ్ చేసుకున్నాడు. అనంతరం ట్యాంకర్ పైకి ఎక్కి పైన ఉన్న పెద్ద మూతను ఇనుప రాడ్డు సాయంతో బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. కింద కాంక్రీట్ బెడ్ ఉండటంతో కింద పడగానే తలకు, కాలుకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే లోడింగ్ కోసం వచ్చిన కొందరు డ్రైవర్లు హుటాహుటిన అక్కడికి చేరుకుని అధికారులకు సమాచారం అందించారు. కేటీపీఎస్ అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రమేశ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ నరేశ్ సందర్శించి వివరాలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య శ్రీలత కుమారులు నితిన్, శ్రీకాంత్ ఉన్నారు. శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో రమేశ్ మృతదేహం చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడి చిన్న కుమారుడు శ్రీకాంత్ వీఎం బంజరలో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. గుడ్ ఫ్రైడే సెలవు కావడంతో శనివారం జరిగే గణితం పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాడు.

బూడిదను శుభ్రం చేయక పోవడంతోనే ప్రమాదం ?

కేటీపీఎస్ 7వ దశ సైలో వద్ద ట్యాంకర్లలో నిత్యం బూడిదను లోడింగ్ చేస్తుంటారు. రోజువారిగా వందలాది ట్యాంకర్లు లోడ్ అవుతుంటాయి. కాగా అక్కడ బూడిద మేటలు వేసి జారిపోయేలా తయారైంది. అందులోనే డ్రైవర్లు కాళ్లు పెట్టి తిరిగి లోడింగ్ అయిన తర్వాత, పైకి ఎక్కి ట్యాంకర్ మూతలు వేసుకుంటుంటారు. తడి యాష్ వల్లే కాలు జారీ పడినట్లు సమాచారం. ఈ విషయమై డీఈ కిరణ్‌ను వివరణ కోరగా లోడింగ్ అనంతరం నీళ్లతో సర్వీసింగ్ చేసిన తర్వాతే బండ్లు బయటకు వెళతాయని తెలిపారు.

పడమట నర్సాపురంలో భూవివాదం



కోర్టు ఆర్డర్‌ను చూపిస్తున్న రామారావు భార్య, పిల్లలు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో సోదరుల మధ్య భూ వివాదం ఏర్పడింది. కొన్నేళ్లుగా ఈ వివాదం పరిష్కారం కాకపోవడంతో ఆత్మహత్యే తమకు శరణ్యమని రామారావు కుటుంబ సభ్యులు అంటున్నారు. శుక్రవారం బాధిత కుటుంబం స్థానిక విలేకరులతో వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన అన్నవరపు రామారావు 161 సర్వే నంబర్‌లో గల భూమిని సాగు చేసి జీవనం సాగించేవాడు. ఆ భూమిని రామారావు తమ్ముడు సత్యనారాయణ ఆక్రమించుకోవడానికి కొంతకాలం వరకు అన్నతో గొడవ పడేవాడని రామారావు భార్య రాజ్యలక్ష్మి తెలిపారు. తాను రాజకీయ నాయకుడిని అంటూ అన్నను భయభ్రాంతులకు గురి చేస్తూ మానసిక ఇబ్బందులకు గురి చేయడంతో రామారావు గుండెపోటుతో మృతి చెందాడని ఆమె చెప్పింది. సత్యనారాయణ తన పేరు మీద ఉన్న భూమి వేరే వాళ్లకు అమ్మి, తన భూమికి బదులుగా తన భర్త పేరు మీద ఉన్న భూమిని అప్పజెప్పాడని వాపోయింది. తమ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి సత్యనారాయణ ఆక్రమించుకున్నాడని, విషయం తెలిసి తమ సత్యనారాయణను ప్రశ్నిస్తే.. మా భూమి అని కోర్టు నుంచి సత్యనారాయణ ఆర్డర్ తీసుకొచ్చాడని, తమపైనే కేసులు పెట్టించాడని కన్నీటి పర్యంతమైంది. రాజకీయ అండదండలున్నాయని, రాష్ట్రస్థాయి పోలీస్ అధికారులు కూడా తెలుసని, తాను తలుచుకుంటే పుట్టగతులు ఉండవని సత్యనారాయణ బెదిరిస్తున్నాడని, పోలీసులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగడం లేదని రాజ్యలక్ష్మి ఆవేదన వ్యక్తంచేసింది.

కారు, లారీ ఢీ

అశ్వారావుపేటరూరల్: లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారంవారిగూడెం వద్ద పాల్వంచ నుంచి అశ్వారావుపేట వస్తున్న కారును ఎదురుగా వచ్చిన లారీ వేగంగా దూసుకొచ్చి ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నాగలక్ష్మి అనే మహిళ తల కు తీవ్ర గాయాలు కాగా, కారు డ్రైవరు కరీంకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన ఇరువురిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు. తలకు గాయమైన నాగలక్ష్మిని మెరుగైన వైద్యం కోసం పాల్వంచ తరలించారు.

చవిటిగూడెంలో విషాదఛాయలు

శ్రీకాళహస్తిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామవాసి మృతి



కోటేశ్వరరావు (ఫైల్)



గాయపడిన కొప్పుల శ్రీను, ఆయన భార్య నాగమణి


అశ్వాపురం: కుటుంబ సభ్యులంతా తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనానికి కారులో వెళ్తున్నారు. కొద్ది సమయంలో తిరుపతి చేరుకుంటారనగా లారీ రూపంలో మృత్యువు ఎదురుగా వచ్చింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందగా, కుటుంబంలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. పలువురు గాయపడ్డారు. శ్రీకాళహస్తిలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మండలంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన బొజ్జా కోటేశ్వరరావు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. అశ్వాపురంకు చెందిన ఎరువులు, పురుగుమందుల దుకాణం నిర్వాహకుడు కొప్పుల శ్రీనివాసరావు (మిల్లు శ్రీను) పరిస్థితి విషమంగా ఉండగా ఆయన భార్య నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను ముగ్గురు కుమార్తెలు, కుమారుడికి గాయాలయ్యాయి. శ్రీను, భార్య నాగమణి తిరుపతిలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చవిటిగూడెం గ్రామానికి చెందిన బొజ్జా కోటేశ్వరరావు (50)కు భార్య, ముగ్గురు కుమార్తెలు. కోటేశ్వరరావు ఆటో నడుపుతూ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తూ ఖాళీ సమయాల్లో కారు డ్రైవర్‌గా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు కుమార్తెలను చదివిస్తున్నాడు. కొప్పుల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు తిరుపతి వెళ్తుండగా కోటేశ్వరరావు డ్రైవర్‌గా వెళ్లాడు. రోడ్డు ప్రమాదంలో కోటేశ్వరరావు మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చవిటిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పామేడు అడవుల్లో వైమానిక దాడులు

లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ – సుకుమా జిల్లాల సరిహద్దు పామేడు సమీప అటవీ ప్రాంత గ్రామాల్లో శుక్రవారం పోలీసులు వైమానిక దాడులకు పాల్పడ్డారంటూ మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈమేరకు మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్‌బ్యూరో అధికార ప్రతినిధి సమత పేరిట శుక్రవారం లేఖ విడుదల చేశారు. గత నెల 25న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బస్తర్ డివిజన్‌లో పర్యటించిన అనంతరం ఈ దాడులు మొదలయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకే పోలీసులు చట్టవ్యతిరేక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పామేడు ప్రాంతంలోని బట్టిగూ డ, కవరగట్ట, మీనగట్ట, దబ్బగట్టల్లోని మావో యిస్టు క్యాంపులపై డ్రోన్లు, హెలీకాప్టర్లతో పోలీసులు మెరుపుదాడులు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల ద్వారా అమాయక గిరిజనుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నందున తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే పోలీసులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మావోయిస్టు నేత సమత ఆ లేఖలో హెచ్చరించారు.

ఎన్ఆర్ఐ సుగుణమ్మ మృతి



సుగుణమ్మ(ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పెందుర్తి సుగుణమ్మ(92) శుక్రవారం మృతి చెందారు. పెందుర్తి మధుసూదన్‌రావు మెమోరియల్ ట్రస్టు చైర్మన్ రవి తల్లి అయిన ఆమె మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కాగా, సుగుణమ్మ శుక్రవారం అమెరికాలో మృతి చెందగా, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, సర్పంచ్ గురవమ్మ, పీఎంఆర్ ట్రస్టు వైస్ చైర్మన్ ఎస్.వీ.ఆర్.పురుషోత్తం రావుతో పాటు విజయ్‌కుమార్, సుంతరమోని నాగార్జున తదితరులు సంతాపం ప్రకటించారు.

తండ్రి మీద దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు

- జోగుళాంబ జిల్లాలో ఘటన


నాగమ్మ (ఫైల్)

శాంతినగర్: వేపచెట్టు నరకవద్దని చెప్పడంతో గొడ్డలితో కన్నతండ్రిపై దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు ఓ కొడుకు. తీవ్రంగా గాయపడిన తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు. చిన్న కుమారుడు ప్రేమరాజ్ ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో పది రోజుల క్రితం ప్రేమరాజ్ రామాపురానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తల్లి నాగమ్మను డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించేవాడు. గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకొంటుండగా ప్రేమ్‌రాజు ఇంటిముందున్న వేప చెట్టును నరికేందుకు ప్రయత్నించాడు. తండ్రి వద్దని వారించడంతో వెంటనే గొడ్డలితో తండ్రిపై దాడి చేయబోయాడు. ఆ సమయంలో తల్లి అడ్డుపడగా గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తల, చెవిపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నాగమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

8 కోచ్‌లు.. టికెట్ ధర రూ. 1,680

- ప్రధాని చేతుల మీదుగా నేడు సికింద్రాబాద్‌–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- తొలిరోజు సాధారణ ప్రయాణికులకు అనుమతి లేదు
- రేపు తిరుపతి నుంచి మొదలుకానున్న రెగ్యులర్ సర్వీసు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేకు తక్కువ సమయంలోనే రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా అందుబాటులోకి వస్తున్న సికింద్రాబాద్‌–తిరుపతి సర్వీసును ప్రధాని మోదీ శనివారం ఉదయం 11:45 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అయితే తొలిరోజు సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసు ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటలకు తిరుపతి నుంచి మొదలు కానుంది. సికింద్రాబాద్‌–తిరుపతి ఏసీ చైర్‌కార్ ధరను రూ. 1,680గా ఖరారు చేయగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధరను రూ. 3,080 (కేటరింగ్ చార్జీలు కలుపుకొని)గా నిర్ణయించారు. అలాగే తిరుపతి–సికింద్రాబాద్ వందే భారత్ రైల్లో ఏసీ చైర్‌కార్ ధర రూ. 1,625గా ఉండగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధర రూ. 3,030గా ఉంది. తిరుపతికి వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్‌లతో పోలిస్తే ఈ రైల్లో టికెట్ ధరలు అధికంగా నిర్ణయించడంతో ప్రస్తుతానికి 8 కోచ్‌లనే ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎలా ఉంటుందో స్పష్టత వచ్చే వరకు తక్కువ కోచ్‌లతోనే నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. శుక్రవారం నుంచి సాధారణ ప్రయాణికులకు టికెట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.



సికింద్రాబాద్‌–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ – కొన్ని సంగతులు..

- దేశంలోనే 13వ వందేభారత్ సర్వీసు
- దక్షిణ మధ్య రైల్వేలో రెండోది
- **ట్రిప్ నంబర్లు:** సికింద్రాబాద్‌–తిరుపతి 20701, తిరుపతి–సికింద్రాబాద్ 20702
- **రెగ్యులర్ ట్రిప్పుల్లో ఈ రైలు ఆగే స్టేషన్లు:** నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు
- **మొత్తం కోచ్‌లు:** 8 (ఎకానమీ చైర్‌కార్ కోచ్‌లు 7, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కోచ్‌లు 1), రెండూ కలిపి మొత్తం సీట్లు: 530
- **ప్రత్యేకతలు:** స్లైడింగ్ డోర్స్, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 360 డిగ్రీల కోణంలో తిరిగే కుర్చీలు, ఇతర కోచ్‌లలో సెమీ స్లీపర్ స్థాయిలో తిరిగే కుర్చీలు, ఎమర్జెన్సీ అలారం బటన్, లోకో పైలట్ కేబిన్‌తో మాట్లాడే ప్రత్యేక వ్యవస్థ, సీసీ కెమెరాలు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాలు ఇవీ

సికింద్రాబాద్ టు తిరుపతి – తిరుపతి టు సికింద్రాబాద్

అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
-	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	-
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

మానవాళికి డెంగీ ముప్పు!

వాతావరణ మార్పులతో దోమల వ్యాప్తి

- 129 దేశాలపై డెంగీ ప్రభావం!
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, అమరావతి



ప్రపంచవ్యాప్తంగా మానవాళికి డెంగీ ముప్పు పొంచి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు, వైరస్‌ల వ్యాప్తి పెరగడమే ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల వెల్లడించింది. దశాబ్దకాలంగా డెంగీ, జికా, చికున్ గున్యా వంటి ఆర్బో వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లు భారీగా పెరిగాయని ప్రకటించింది. ఏడాదికి 100 మిలియన్ల నుంచి 400 మిలియన్‌ల వరకు ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం జనాభాలో దాదాపు సగం మందికి డెంగీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడించిన కొన్ని ముఖ్యమైన వివరాలు...

- ▲ అటవీ నిర్మూలన, పారిశుధ్యం, పట్టణీకరణ, నీటిపారుదలలో సమస్యలు దోమలవ్యాప్తికి ప్రధాన కారణం.
- ▲ ముఖ్యంగా అవపాతం(వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ద్రవీకరించడం), ఉష్ణోగ్రత పెరుగుదల, అధిక తేమ వంటివి దోమల అవాసాలకు అనుకూలంగా ఉన్నాయి.
- ▲ ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో డెంగీ కేసులు సుమారు 0.5 మిలియన్ నమోదవగా, 2019 నాటికి 5.2 మిలియన్లకు పెరిగాయి. 2023లోనూ ఇదే ఉధృతి కొనసాగుతోంది.
- ▲ ఈ ఏడాది దాదాపు 129 దేశాలు డెంగీ బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో డెంగీ వ్యాప్తి కనిపిస్తోంది.
- ▲ ఈ ఏడాది మార్చి చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 4,41,898 డెంగీ కేసులు నమోదవగా, 119 మంది మరణించారు.
- ▲ చికున్ గున్యా దాదాపు అన్ని ఖండాల్లో విస్తరించింది. ప్రస్తుతం సుమారు 115 దేశాల్లో దాని ప్రభావం ఉంది.
- ▲ ప్రపంచవ్యాప్తంగా జికా వైరస్ క్షీణించింది. అయితే మళ్లీ 89 దేశాల్లో వ్యాప్తిచెందే పరిస్థితులు ఉన్నాయి.

అన్ని భాషల్లోనూ పరీక్ష రాసే అవకాశమివ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి కేటీఆర్
- సీఆర్‌పీఎఫ్‌లో హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లోనే పరీక్ష ఉండటంపై అభ్యంతరం
- రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్ర హోంమంత్రికి లేఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాల కోసం కేవలం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే పోటీ పరీక్షల నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కేంద్రమంత్రి అమిత్ షాకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అమిత్ షాకు ఓ లేఖ రాశారు. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగ సిబ్బంది నియామకం కోసం చేపడుతున్న ఈ పరీక్షను తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళంతో పాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని కోరారు. కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే ఈ పోటీ పరీక్షలను నిర్వహించడంతో తీవ్ర వివక్ష ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో చదవని లేదా హిందీ ప్రాంతాలకు చెందని నిరుద్యోగ యువకులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 2020 నవంబర్ 18న ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం కేంద్ర ప్రభుత్వానికి ఇదే విషయమై లేఖ కూడా రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాంతీయ భాషల్లో చదువుతున్న కోట్లాది యువకుల పట్ల ఎలాంటి వివక్ష, అసమానతలు లేకుండా వారికి సమాన అవకాశాలు దక్కేలా సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్‌కు సవరణ చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పేపర్ల లీకేజీలో బీజేపీ హస్తం

- బండి సంజయ్‌పై ‘ఉపా’చట్టం కింద కేసు పెట్టాలి
- వచ్చే ఎన్నికల్లో సీపీఎంతో కలసి పోటీ చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ హస్తం ఉన్నట్లుగా తాము భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ పాత్ర బయటపడి ఉండకపోతే రోజుకో పేపర్ లీకయ్యేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎవరో ఒకరికి వాట్సాప్‌లో పేపర్ పెడితే.. ఆయన బండి సంజయ్‌కి పంపాడే తప్ప ఇందులో సంజయ్ తప్పేముందని కొందరు మాట్లాడడం గర్హనీయమని అన్నారు. ఫోన్‌లో జరిపిన చాటింగ్‌లో ఏం చేయాలి, ఎలా చేయాలి, ధర్నాలు చేయాలనే సూచనలు ఉన్నట్లుగా తెలుస్తోందని చెప్పారు. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే ఇలాంటి చర్యలు ఉగ్రవాద కుట్రల కంటే ప్రమాదకరమైనవి అయినందున సంజయ్‌పై ఉగ్రవాదులపై మోపే ‘ఉపా’వంటి కఠిన చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో సింగరేణిని ప్రైవేటీకరించబోమని చెప్పిన ప్రధాని.. ఇప్పుడు ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఈనెల 14న హైదరాబాద్ నుంచి మొదలుపెడుతున్న యాత్ర వచ్చేనెల 14న కొత్తగూడెం చేరుకుంటుందని, ఈ సందర్భంగా లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలసి పోటీ చేస్తాయని కూనంనేని తెలిపారు. ఈ అంశంపై 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నం కోసం తన్నులాట

టెంట్లు కూల్చి.. కుర్చీలు పగులగొట్టి.. • బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస


సీరోలులో ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలు కూల్చిన టెంట్లు

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా మారింది. చాలామంది భోజనం చేయగా..సుమారు వందమంది కార్యకర్తలకు సరిపోలేదు. దీంతో కాంపల్లి, సీరోలు బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య గొడవ తలెత్తింది. కొందరు అన్నం గిన్నె, కూర గిన్నెలను లాక్కునేందుకు ప్రయత్నించగా.. మరికొందరు టెంట్లను కూల్చేసి కుర్చీలను పగులగొట్టారు. పోలీసులు కల్పించుకుని కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన స్టేజీపై నుంచి కార్యకర్తల ఘర్షణను చూసి నిర్ఘాంతపోయారు. ఈ నెల 5న అయ్యగారిపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలోనూ గ్రామస్తులు కూర గిన్నెలు, అన్నం గిన్నెలు ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లిపోయారు. రెండు ఆత్మీయ సమ్మేళనాల్లో భోజనాల విషయంలో గొడవలు జరగడం గమనార్హం.

బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ప్రహ్లాద్‌జోషి, అరుణ్ సింగ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌లు సభ్యత్వ రసీదు అందజేసి, పార్టీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవం తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఉపకరిస్తుందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రధాని మోదీ అద్భుతంగా పోరాడుతున్నారని చెప్పారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు.

జిల్లా వార్తలు

నిత్యాన్నదానానికి రూ.3లక్షల విరాళం


ఈఓకు విరాళం అందచేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందచేశారు. విజయవాడకు చెందిన రవెళ్ల సతీష్, హేమచంద్ర రూ.3,03,348ను ఈఓ ఎల్.రమాదేవికి అందజేయగా ఆమె అభినందించారు. కాగా, రశ్మి, నిత్య నందిని, వెంకటనందన్ పేరిట అన్నదానం చేయాలని దాతలు కోరారు. అలాగే, హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన బీకేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కె.రామాంజనేయరెడ్డి కూడా రూ.2,50,888 విరాళం అందజేశారు.

సనోజ్... సలాం


సనోజ్‌కు స్వాగతం పలుకున్న గ్రామస్తులు

ఏన్కూరు: దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టిన యువకుడు సనోజ్‌కు ఏన్కూరు గ్రామస్తులు స్వాగతం పలికారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కృషినగర్ జిల్లా గరమ్‌పూర్‌బాత్ గ్రామానికి చెందిన 23ఏళ్ల యువకుడు రోవింగ్ సనోజ్ ఇంజనీరింగ్ పూర్తిచేయగా, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పాదయాత్ర చేసి అక్కడి సంస్కృతి, సంప్రదాయాలపై పుస్తకం వెలువరించాలని నిర్ణయించుకున్నాడు. గత ఏడాది అక్టోబర్ 21న మొదలుపెట్టిన యాత్ర పది రాష్ట్రాల పరిధిలో 4,230 కి.మీ పూర్తిచేసుకుని తెలంగాణలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏన్కూరు వచ్చిన ఆయనకు స్థానికులు స్వాగతం పలికి సన్మానించారు.

సమస్యల సాధనకు నిరవధిక సమ్మె


సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఈ జేఏసీ ప్రతినిధులు

- ఈనెల 17నుంచి సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు
- విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ భేటీలో పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం రూరల్: సమస్యల సాధనకు నిరవధిక సమ్మెకు దిగక తప్పడం లేదని టీఎస్‌పీఈ జేఏసీ(తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ) ప్రతినిధులు స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె చేపడుతుండగా ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి సమావేశంలో ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణ, 2004 వరకు పెన్షన్ సౌకర్యం, ఆర్టిజన్ కార్మికుల సమస్యలు, అన్‌మ్యాన్ కార్మికులు, బిల్ కలెక్టర్లు, పీస్ రేటు కార్మికులు, ఇతర కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ యాజమాన్యం పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని25 విద్యుత్ సంఘాలు జేఏసీగా ఏర్పడగా, 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయడంతో పాటు సమస్యల సాధనకు కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌పీఈ జేఏసీ కేంద్ర కార్యవర్గ ప్రతినిధులు రత్నాకర్‌రావు, ఇనుగాల శ్రీధర్, వజీర్, వెంకన్న గౌడ్, శ్రీనివాస్, వేణుగోపాల్, విజయ్, సంపత్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, జి.నాగరాజు, కలువల సత్యనారాయణరావు, జి.రవీందర్‌తో పాటు తక్కెళ్లపల్లి శేషగిరిరావు, పి.మహేందర్‌రెడ్డి, సొమ్యానాయక్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, ఎం.ప్రసాద్, హీరాలాల్, రవికుమార్, మోహన్‌రావు, జీవన్‌కుమార్, సాంబమూర్తి, కిషోర్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమ్మె పోస్టర్లను ప్రతినిధులు ఆవిష్కరించారు.

16న సీపీఎస్ ఉద్యోగుల ర్యాలీ

ఖమ్మంసహకారనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈ నెల 16న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్‌ఈయూ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. ఖమ్మంలో వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులను శశిధర్ సహా నాయకులు శుక్రవారం కలిసి తమ ర్యాలీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ర్యాలీ నిర్వహించడమే కాక, జూన్ రెండో వారంలో పాత పెన్షన్ సంకల్పయాత్ర, జూలై మొదటి వారంలో బస్సుయాత్ర, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాజకీయ రణరంగ మహాసభ, అక్టోబర్ 1న ఢిల్లీలో పెన్షన్ శంఖ్‌నాథ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, టీఎన్జీవోస్, టీజీవోస్, పీఆర్‌టీయూ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్, టీఎస్‌యూటీఎఫ్, టీఆర్‌టీఎఫ్, టీటీఎఫ్, టీఎస్‌పీటీఏ తదితర సంఘాల నాయకులను కలిసి తమ ఆందోళనకు మద్దతు తెలపాలని కోరగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు రాయల కరుణాకర్, తోట విక్రమ్, పోతరెడ్డి రామగోపి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


టీఎన్జీవోస్ నాయకుల మద్దతు కోరుతున్న సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు

రామాలయంలో ప్రక్షాళన షురూ!


భద్రాద్రి రామాలయం వ్యూ

- కీలక ఉద్యోగుల విభాగాల్లో మార్పు
- తనిఖీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్.రమాదేవి తనదైన శైలిలో ప్రక్షాళన ప్రారంభించారు. దేవాదాయ శాఖలో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఆమె భద్రాద్రి ఆలయంలోనూ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. తాజాగా శ్రీరామనవమి ఉత్సవాలు పూర్తి కావడంతో ఆలయ నిర్వహణపై దృష్టి సారించారు. గత మూడు రోజులుగా ఆలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వైదిక పెద్దలతో వరుసగా సమావేశమవుతూ తన తనిఖీల్లో వెల్లడైన లోపాలను వారి దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే, అంతర్గత బదిలీలు సైతం చేపట్టారు. ఇందులో తొలి విడతగా ఏఈఓలుగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణల విభాగాల్లో మార్పు చేసినట్లు సమాచారం. అలాగే, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర విభాగాల ఉద్యోగులను కూడా ఒకటి, రెండు రోజుల్లో బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది.

తనిఖీలకు శ్రీకారం

ఆలయంలో పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వస్తుండడం, సిబ్బందిలో క్రమశిక్షణా రాహిత్యంపై విమర్శలు ఉన్న నేపథ్యాన వీటికి చెక్ పెట్టేందుకు ఈఓ రమాదేవి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఆలయంలోని అన్ని విభాగాల్లో తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఆలయంలోని ప్రసాదాలు, టికెట్ కౌంటర్లు, ప్రసాదాల స్టోర్ రూం, ప్రచార శాఖలతో పాటుగా అన్ని విభాగాల్లో తనిఖీలు చేసేలా అధికారం కల్పించినట్లు సమాచారం. ఈ కమిటీలో ఈఈ రవీందర్, సూపరింటెండెంట్లు నిరంజన్, శ్రీనివాసరెడ్డి, ఏఈఓ భవాని రామకృష్ణ సభ్యులుగా ఉంటారని తెలుస్తుండగా, అధికారికంగా వెల్లడి కాలేదు. అదేవిధంగా ఆలయ అంతర్గత సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేస్తున్న వారిపై నిఘా వేసినట్లు చెబుతూ తీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లుగా ప్రచారం సాగుతోంది.


ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన భక్తులు

భక్తులు, సిబ్బందికి నడుమ వాగ్వాదం

భద్రాచలం రామయ్య ఆలయంలో భక్తులు, ఆలయ సిబ్బందికి నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. బేడా మండపంలో నిత్యకల్యాణానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అయితే, ముందుగా వచ్చిన వారికి కాదని ఇతరులను ముందు వరుసలో కూర్చోబెడుతుండడంతో కొందరు అభ్యంతరం తెలిపారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం కూర్చోబెట్టాల్సి వచ్చిందని ఆలయ అధికారులు, సిబ్బంది సర్దిచెప్పినా భక్తులు వినకపోవడంతో ముందు వచ్చిన వారినే తొలి వరుసల్లో కూర్చోబెట్టగా గొడవ సద్దుమణిగింది.

పొత్తు పొడిచినట్లేనా?!



కలిసి సభల్లో పాల్గొంటున్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కమ్యూనిస్టులు చెబుతున్నారు. కానీ ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్‌కు ఓ ప్రజాప్రతినిధి వాహనానికి మాత్రం కమ్యూనిస్టులు ఎర్రరంగు వేసి వాడుకుంటుండడం గమనార్హం. గులాబీ, ఎరుపు రంగులు కలగలిసిన ఈ వాహనం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

బస్సు ఆలస్యంపై ప్రయాణికుల ఆందోళన

సత్తుపల్లిటౌన్: సూపర్ లగ్జరీ బస్సు నెమ్మదిగా రావడంతో ప్రయాణం ఆలస్యమైందని పలువురు సత్తుపల్లి ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. గుడ్ ఫ్రైడేకు స్వస్థలాలకు ఎక్కువ మంది వస్తుండటంతో సత్తుపల్లి డిపో అధికారులు హైదరాబాద్ నుంచి రెగ్యులర్ సర్వీస్‌లతో పాటు అదనంగా బస్సులు నడిపించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికులు ఉదయం 6.30 గంటలకు సత్తుపల్లి చేరుకోవాల్సి ఉండగా 8.30 గంటలకు వచ్చారు. ఈ బస్సు నాయకన్‌గూడెం వద్దకు చేరుకున్నాక నెమ్మదిగా వెళ్తుండడంతో ప్రయాణికులు నిలిపేశారు. దీంతో డ్రైవర్ సత్తుపల్లి డిపో అధికారులకు సమాచారం ఇవ్వగా ఖమ్మం బస్టాండ్‌లో ఉన్న సత్తుపల్లి డిపో నైట్‌హాల్ట్ ఎక్స్‌ప్రెస్‌ను నాయకన్‌గూడెం పంపించి ప్రయాణికులను సత్తుపల్లికి తీసుకొచ్చారు. అయితే, సూపర్ లగ్జరీ బస్సు టికెట్లు తీసుకుంటే ఎక్స్‌ప్రెస్‌లో తీసుకొచ్చారని ప్రయాణికులు ఆందోళన చేయగా ఆర్టీసీ అధికారులు సర్దిచెప్పి పంపించారు.


ప్రయాణికులకు సర్దిచెబుతున్న ఉద్యోగులు

ఈ విషయమై డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి వివరణ కోరగా సూపర్ లగ్జరీ బస్సులో సాంకేతిక సమస్యతో ఆలస్యమైందని పేర్కొన్నారు.